# గుండెకు గండం..!

**-ఆరోగ్యంగానే కనిపిస్తూ కుప్పకూలిపోతున్న వైనం -గుడిలో ప్రదక్షిణలు చేస్తూ కేపిహెచ్‌బిలో కుప్పకూలిన యువకుడు -గుండెపోటుతో మృతి..ఎలాంటి అలవాట్లూ లేవు**



**హైదరాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త**

గుడిలో ప్రదక్షిణలు చేయడానికి వెళ్లిన ఓ యువకుడు గుండెనొప్పితో మృతిచేందాడు. కేపీహెచ్‌బిలోని అమ్మ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్న కానంపల్లి విష్ణువర్ధన్ (31) ఆయన నివాసానికి సమీపంలోని ఆంజనేయస్వామి అలయానికి వెళ్లి ప్రదక్షిణలు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి, ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన ఆయన్ను ఇతర భక్తులు సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలిస్తుండగా అంతలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో వారు కన్నీరు మున్నీరయ్యారు. కానంపల్లి విష్ణువర్ధన్‌కు ఎలాంటి చేడు అలవాట్లూ లేవని స్నేహితులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఇలా.. నిండు యవ్వనం, రాళ్లు తిన్నా అరిగిపోయే వయసు.. ఉజ్వల భవిష్యత్ ఉన్నవారు.. అలాంటివారు అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్నారు. నొప్పి తీవ్ర స్థాయిలో ఉంటుండటంతో ప్రాణాలు వదులుతున్నారు. కొందరు వ్యాయామం చేస్తూ అస్వస్థతకు గురై, ఆసుపత్రులలో చేరి మృతి చెందిన పలు ఉదంతాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల నగరంలో గుండెపోటు మరణాలు బాగా ఎక్కువయ్యాయి. ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట ఇలాంటివి వెలుగు చూస్తున్నాయి. చాలా హెల్దీగా ఉన్న వాళ్లు కూడా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు తరచూ చూస్తున్నాం. మరికొందరు కొవిడ్‌ను జయించిన అనంతరం ఈ లోకాన్ని వదిలివెళ్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఛాతిలో ఇబ్బందిగా అనిపిస్తే చాలామంది యువకులు సాధారణమేనని భావిస్తున్నారు. తలనొప్పి వస్తే సొంతంగా మందులు కొనుక్కొని వాడుతున్నారు. కడుపులో నొప్పి వస్తే అసిడిటీ అనుకొని ఇతర వైద్యుల వద్దకు వెళ్తున్నారు. కానీ ఛాతినొప్పిని గుండె సమస్య లక్షణాలని అంచనా వేయలేకపోతున్నారు. దీంతో చికిత్స ఆలస్యమై ప్రాణాపాయ స్థితికి దారితీస్తోందని వైద్యులు చెబుతు న్నారు. గుండె నొప్పి ఏ కారణం ఏ లక్షణంతో ఉంటుందో తెలియని పరిస్థితి కూడా దీనికి కారణ మని కార్డియాలజిస్టులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కార్డియోవాస్కులర్ జబ్బులు బాగా పెరిగాయి. ముఖ్యంగా మహిళల్లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

అసలు గుండెపోటు ఎందుకు జరుగుతుందో తెలుసుకుందాం.. అన్ని కండరాల్లాగే గుండె కండరాలకీ రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళాలు ఉంటాయి. వాటి ద్వారానే గుండెకు అందాల్సిన ఆక్సిజన్, పోషకాలు అందుతుంటాయి. ఒకవేళ కొవ్వు పేరుకోవడం వంటి కారణాలతో రక్తనాళాలు ఆ పూడుకుపోతే గుండె కండరం చచ్చుబడిపోవడం మొదలవుతుంది. అదే 'గుండెపోటు' రూపంలో కనిపిస్తుంది. ఇలాంటి సమయాల్లో ఎంత వేగంగా గుండెకు అందాల్సిన రక్తాన్ని మళ్లీ పునరుద్ధరించగలిగితే అంతగా గుండెపోటు ప్రభావాన్ని తగ్గించవచ్చు. గుండెపోటుకు గురైన వ్యక్తిని వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తీసుకురావాలంటూ వైద్యులు చెప్పేది అందుకే. అయితే కొందరిలో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళాలన్నీ పూడుకుపోయి.. హాస్పిటల్‌కు చేరేలోపే గుండె కండరం పూర్తిగా చచ్చుబడిపోతే గుండెకే కాదు గుండె నుంచి మన దేహంలోని ఏ అవయవానికీ రక్తం సరఫరా కాదు. ఇలాంటి సమయాల్లోనే రోగి మరణానికి దారితీసే ప్రమాదకరమైన స్థితి ఉందని కార్డియాలజిస్టులు పేర్కొంటున్నారు. అందుకే ముందు నుంచీ జాగ్రత్తలు తీసుకుంటూ పూడిక ఉన్నప్పుడు స్టెంట్ వేయించడం, రక్తాన్ని పలుచబార్చే మందులు వాడటం, అన్ని ప్రధాన రక్తనాళాలూ పూడుకుపోయినప్పుడు అవసరాన్ని బట్టి గుండె శస్త్రచికిత్స చేయించడం వంటివి అవసరమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

మారిన జీవన శైలి, దూమపానం, మాదక ద్రవ్యాల వినియోగం కొంతమంది యువతలో పెరిగిపోయింది. ధూమపానం వల్ల రక్తాన్ని సరఫరా చేసే నాళాలు కుంచించుకుపోయి గుండె నొప్పికి గురవుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఆహార అలవాట్ల కారణంగా కొందరికి చిన్న వయసులోనే గుండె జబ్బులు తలెత్తుతున్నాయి. గుండె రక్తనాళాల్లో పూడికలు (బ్లాక్స్) ఏర్పడి కరోనరీ హార్ట్ డిసీజ్‌కు దారితీస్తోంది. 25 ఏళ్ళ వయసుకే రక్తనాళాల్లో పూడికల కారణంగా గుండె శక్తి సామర్థ్యాలు తగ్గుతున్నాయి. స్టెంట్లు, యాంజియోప్లాస్టీ చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, కొలెస్ట్రాల్ కారణంగానూ గుండె జబ్బులు పెరుగుతున్నాయి. ధూమపానం, పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వల్ల త్వరగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదముందని వైద్యులు పేర్కొంటున్నారు.



# హైదరాబాద్ వార్త

# సర్వేలో ఆ వివరాలు చెప్పలేం..!

**-కొన్నింటికి చెప్పి ..మరికొన్నింటిని చెప్పేందుకు నిరాసక్తి**
**-ఆస్తుల విషయంలో గోప్యంగా వ్యవహరిస్తున్న యజమానులు**
**-ఎన్యూమరేటర్లలకు తప్పని తిప్పలు**
**-జిహెచ్ఎంసి పరిధిలో 2,98,374 కుటుంబాల సర్వే పూర్తి**



**హైదరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అన్ని వివరాలు వెల్లడించేందుకు కొందరు ఇష్టపడడంలేదు. ముఖ్యంగా ఆస్తుల విషయంలో గోప్యంగా వ్యవహరిస్తున్నారు. సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలు ఉండగా కొన్నింటికి సమాధానం చెప్పేందుకు ఆసక్తి కనబరచడం లేదు. అదే సమయంలో సర్వేపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ఎన్యుమరేటర్లు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. రాష్ట్రంలో గత శనివారం నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి, రెండో రోజు ఆశించిన స్థాయిలో సర్వే జరగలేదు. మరోవైపు ఒక్కో ఫారం నింపేందుకు ప్రభుత్వం భావించినదానికంటే ఎక్కువ సమయం పడుతోంది. ప్రశ్నావళిలోని ప్రశ్నలకు ప్రజలు చెప్పిన సమాధానాలను బట్టి.. ప్రభుత్వం రూపొందించిన బుక్‌లెట్ చూసి సంబంధిత కోడ్ నమోదు చేయాలి. ఈ విషయంలో ఎన్యుమరేటర్లు కొంత తికమకపడుతున్నారు. పాతబస్తీలో కొన్ని చోట్ల స్టిక్కర్లను సైతం చింపేస్తున్నారు. పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల్లో ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్ లోనూ పూర్తిస్థాయిలో స్టిక్కర్లు అతికించలేదు. స్టిక్కర్లు లేకపోవడం, మలక్‌పేట, చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో పెద్ద పెద్ద భవనాలు ఉండడంతో సమస్యలు తప్పడం లేదు. అధికారులు అడిగిన ప్రశ్నలకు ప్రజలు సరైన సమాధానాలు ఇవ్వట్లేదు. ఒషన్ కార్డులు ఇవ్వలేదు. షాదీముబారక్ డబ్బులు రాలేదు? వివరాలను ఎందుకు చెప్పాలి? అంటూ మరికొందరు ప్రశ్నించారు.

**అక్కడి నుంచి ఎన్యూరేటర్లకు నుంచి తిప్పలు..**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలు (56 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నలు) ఉన్నాయి. సర్వే బుక్లెట్ రెండు భాగాలుగా ఉంది. మొదటి విభాగం (పార్ట్1)లో కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. ఇందులో విద్య, ఉద్యోగ, ఉపాధి, భూమి, రిజర్వేషన్లు, రాజకీయాలు, వలసలకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. సాధారణ వివరాలను వెల్లడించేందుకు ప్రజలు సిద్ధంగానే ఉన్నా.. కాలమ్ నంబర్ 19 నుంచి వస్తున్న పలు ప్రశ్నలు ఆందోళన రేపుతున్నాయి. ప్రధానంగా వ్యాపారం వార్షిక టర్నోవర్, వార్షికాదాయం, ఆదాయ పన్ను చెల్లింపులు, బ్యాంకు ఖాతా సమాచారం, భూములు, ధరణి పాసు పుస్తకం వివరాలు, భూమి కొనుగోలు కోసం వనరులకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించేందుకు చాలా మంది విముఖత చూపుతున్నారు. అదేవిధంగా రిజర్వేషన్ ఫలాలు, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలను అడిగినప్పుడు.. ఆ వివరాలు ఎందుకని ఎదురు ప్రశ్నలు ఎన్యూమరేటర్లకు ఎదురవుతున్నాయి.

**ఆర్థిక స్థితిగతులపై ఆందోళన..**

సర్వే ప్రశ్నావళి రెండో విభాగం (పార్ట్2)లో కుటుంబ ఆర్థిక స్థితిగతులపై ప్రశ్నలు అడిగినప్పుడు ప్రజల్లో ఆందోళన కనిపిస్తోంది. వాటికి సరైన సమాధానం రావడం లేదని ఎన్యూమరేటర్లు చెప్పున్నారు. రుణాలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, పశు సంపద, స్థిరాస్తి, వాహనాలు, రేషన్‌కార్డు, నివాస గృహానికి సంబంధించిన సమాచారాన్ని చెప్పేందుకు ఇష్టపడటం లేదని అంటున్నారు. బ్యాంకు రుణాలు, అప్పులు, ఆస్తులకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతున్నప్పుడు ప్రజల నుంచి ఎదురు ప్రశ్నలు వస్తున్నాయని వివరిస్తున్నారు. మేం రుణాలు చెల్లించకుంటే ప్రభుత్వం చెల్లిస్తుందా? ఆస్తుల వివరాలు మేమెందుకు చెప్పాలి? మాకున్న అప్పులకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? ఆదాయం వివరాలు చెబితే పథకాలు వస్తాయా? ఉన్నవాటికి కోతపెడతారా? అని ప్రజలు నిలదీస్తున్నారని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు.

**జిహెచ్ఎంసి పరిధిలో 2,98,374కుటుంబాల సర్వే పూర్తి..**

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర సర్వేలో భాగంగా జిహెచ్ఎంసి వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,98,374 కుటుంబాలు సర్వే పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సోమవారం నాటికి మొత్తం 1,58,150 కుటుంబాలుకాగా మంగళవారం 1,40,224 మొత్తం 2,98,374 కుటుంబాలు పూర్తి అయ్యాయి. ఇందుకోసం

సర్వేలో 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్ ను నియమించి, 10 బ్లాక్ లకు ఒక సూపర్ వైజర్ లను నియమించడం జరిగింది. అందుకు 19248 మంది ఎన్యుమరేటర్ లతో పాటుగా 10 మంది ఈబి లకు ఒక సూపర్వైజర్ లను నియమించిన విషయం తెలిసిందే. తప్పులకు తావివ్వకుండా రెండు జోన్ లకు ఒక మానిటరింగ్ అధికారులుగా ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. దానికి తోడు జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న సీనియర్ అధికారులను మూడు సర్కిళ్ల చొప్పున ఒక నోడల్ అధికారులను నియమించారు. వీరందరు క్షేత్రస్థాయిలో పర్యటించి సమర్థవంతంగా సర్వే జరిగేందుకు కృషి చేస్తున్నారు.

జి హెచ్ ఎం సి కో ఆర్డినేటర్ అధికారిగా హెచ్ ఎం డి ఎ కమిషనర్ సర్ఫ రాజ్ అహ్మద్ వ్యవహరిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ఆంక్షలు సడలింపు

**-కమిషనర్ సివి ఆనంద్**

**పంజగుట్ట, నవంబర్ ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో కొన్ని రోజులుగా అమలవుతున్న నిషేధాజ్ఞలను సడలిస్తూ నగర పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సచివాలయ పరిసరాల్లో తప్ప నగరంలోని ఇతర ప్రాంతాల్లో శాంతియుతంగా, పోలీసుల అనుమతితో నిరసనలు, ధర్నాలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## అధికారులపై దాడికి పిసిబి ఉద్యోగుల నిరసన



వికారాబాద్ జిల్లాలో జరిగిన దాడికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పై దాడి కి నిరసనగా తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు హెడ్ ఆఫీస్ ముందు మంగళవారం ఉద్యోగులు సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలో ఫార్మా సిటీ ఏర్పాటు చేయడానికి తీసుకున్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా భూసేకరణ సమావేశంలో జిల్లా కలెక్టర్ పై జరిగిన దాడిని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సిబ్బంది హెడ్ ఆఫీస్ దగ్గర ఉద్యోగుల సంఘం అద్యక్షుడు, ప్రదాన కార్యదర్శి శ్రీవాస్తవ, కృపానంద్ ల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డ్యూటీలో ఉన్న సిబ్బందిపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. అద్యక్షులు శ్రీవాస్తవ మాట్లాడుతూ అధికారులు పట్ల గౌరవం, ప్రజాస్వామ్య విధానాల పట్ల అంకిత భావము వుండాలని వారు డిమాండ్ చేసారు. బాధ్యులపై ప్రభుత్వము కఠిన చర్యలు తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేసారు. కాలుష్య నియంత్రణ మండలి చేపట్టే పబ్లిక్ హియరింగు లకు పోలీసులు తగిన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నాలుగవరోజు ఘనంగా కొనసాగిన కోటిదీపోత్సవం



డాక్టర్ కే.లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న కోటి దీపోత్సవ నిర్వాహకులు

**ముషీరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:** లోయర్ ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న కోటిదీపోత్సవంలో నాలుగవరోజు అలంపురం జోగులాంబ కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్తీకమాసం, ఏకాదశి పురస్కరించుకుని వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా కంచికామాక్షి, శృంగేరి శారదాంబికకు కోటి పసుపు కొమ్ములతో సుమంగళీ పూజ నిర్వహించారు. గుజరాత్ శాంతి మందిరం శ్రీనిత్యానంద మహామండలేశ్వర్ స్వామి, ఆర్షవిద్యాగురుకులం శ్రీసర్వవిదానంద సరస్వతి స్వామి గార్ల ఆశీర్వచనం, డాక్టర్ మల్లాప్రగడ శ్రీమన్నారాయణ ప్రవచనం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ హాజరై మొదటి కార్తీక దీపాన్ని వెలిగించారు. సప్త హారతులు, మహాదేవుని నీరాజనాలు, భారతీయ నృత్యరీతులతో, కోటి దీపాల కాంతులతో ప్రాంగణం వెలిగిపోయింది.

## మార్నింగ్ వాక్ చేస్తున్న న్యాయవాదిపై దుండగుల దాడి

**హైదరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

నగరంలోని ఖైరతాబాద్‌లో న్యాయవాది కల్యాణ్‌పై దుండగులు కత్తితో దాడికి యత్నించారు. కల్యాణ్ మార్నింగ్ వాక్‌కు వెళ్లగా ఈ ఘటన జరిగింది. దుండగులు న్యాయవాది సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో జరిగిన పెనుగులాటలో కల్యాణ్‌కు గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా మూడు బృందాలతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ ఘటనకు పాల్పడింది సెల్ఫోన్ చోరీలకు పాల్పడే ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు.

## భార్యను గొంతు కోసం తగలబెట్టిన భర్త

**- అగ్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం**

**-స్థానికులు రావడంతో పోలీసులకు లొంగిపోయిన ఫైజ్ ఖురేషి**

**హైదరాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త :** చిన్న పాటి గొడవలకు సహనం కోల్పోయిన భర్త.. భార్యపై కత్తితో దాడి చేసి తగలబెట్టిన ఘటన హైదరాబాద్ లో సంచలనంగా మారింది. నగరంలోని బండ్లగూడలో భార్యాభర్తలు ఫైజ్ ఖురేషి, ఖమర్ బేగం నివాసం ఉంటున్నారు. వీరిద్దరికి వివాహయై ఆరు సంవత్సరాలైంది. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భర్త ఫైజ్ ఖురేషి నగరంలో ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులు సాఫీగా సాగిన వీరి జీవితంలో మనస్పర్థలు మొదలయ్యాయి. రోజూ ఏదో గొడవ జరుగుతుండటంతో భర్త ఖురేషి భార్య ఖమర్ పై ద్వేషం పెంచుకున్నాడు. ఎలాగైనా భార్యను చంపాలని ప్లాన్ వేసుకున్నాడు. తనతో పాటు కత్తిని కూడా తెచ్చుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి చిన్న పాటి గొడవ మళ్లీ మొదలైంది. దీంతో అనుకున్న విధంగా తనతో పాటు తెచ్చుకున్న కత్తితో భార్యపై దాడి చేశాడు. అనంతరం అతి కిరాతకంగా గొంతుకోసం దారుణంగా హత్య చేశాడు. ఆమె మృతి చెందిన అనంతరం మృతదేహాన్ని తగలబెట్టి అగ్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. చుట్టుపక్కల వాళ్ళు రావడంతో.. భయాందోళన చెందిన భర్త నేరుగా పోలీస్ స్టేషన్ వెళ్ళి లొంగిపోయాడు. ఖురేషిపై కేసు నమోదు చేసి, భార్య మృత దేహాన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే వీరిద్దరి గొడవ జరగుతున్నప్పుడు ఇద్దరు పిల్లలు ఎక్కడ వున్నారు.. అనేదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఖమర్ మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఇందిరమ్మ నగర్ లో యువతి ఆత్మహత్య

**-యువకుడి వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడిందంటూ తండ్రి ఫిర్యాదు**

**బేగంపేట నవంబరు 12, ప్రభాతవార్త**

తల్లి దండ్రులు పనికి వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి తమ కుమార్తె ఇంట్లో చీరెతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట రసూల్‌పురా ఇందిరమ్మ నగర్ లో గుంజరి విట్టల్ కుటుంబం నివాసం ఉంటుంది. ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 11వ తేదీన ఉదయం విట్టల్ కుటుంబం ఉదయం 3గంటలకు పనికి వెళ్లారు. రాత్రి గం 11.30నిలకు ఇంటికి చేరుకున్న విట్టల్ ఇంటి తలుపుకొట్టి స్రవంతిని పిలిచినా ఆమె పలకలేదు. దీంతో తలుపు పగుల గొట్టి లోపలికి వెళ్లి చూడగా స్రవంతి(19)ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరెతో ఉరివేసుకుని ఉండటం గమనించాడు. వెంటనే ఆమెను కిందికి దించి బేగంపేట లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ విధులలో ఉన్న డాక్టర్లు ఆమెను స్రవంతిని పరిక్షించి ఆమె మృతి చెందినట్లు ధృవీకరించారన్నారు. స్రవంతి మారేడుపల్లి కస్తూర్బా కాలేజిలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతుంది. అయితే తమ ఇంటి సమీపంలో నివసిస్తున్న సురేష్ అనే యువకుడు తమ కుమార్తె సెల్ కు మెసేజ్‌లు పెడుతూ ఆమె నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేసాడన్నారు. అతని వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని, పూర్తి స్థాయిలో విచారించాలని కోరుతూ విట్టల్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె. నాగరాజు తెలియజేసారు.

## ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య....

**బేగంపేట నవంబరు 11, ప్రభాతవార్త**

ఇందిరమ్మ నగర్‌లో యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ నగర్ హనుమాన్ ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న రేకుల ఆనంద్ (38)మంగళవారం ఉదయం గం 7.50నిల సమయంలో ఇంటిలోపల నుంచి గడియపెట్టుకుని ఉన్నాడన్నారు. ఎంతసేపు పిల్చినా అతను బయటకు రాకపోవడంతో తలుపులు బలవంతంగా తెరిచి చూడగా ఆనంద్(38)ఉరివేసుకుని ఉన్నాడన్నారు. వెంటనే అతని సోదరుడు రేగుల రవి కిందికి దించి చూడగా అప్పటికే అతను మృతి చెందిఉన్నాడన్నారు. వెంటనే బేగంపేట పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. మృతుని సోదరుడు రేగుల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన ఆనంద్‌కు భార్య మహేశ్వరి వినయ్(9), గౌతమి(7), తన్విక్(ఒకటిన్నర సంవత్సరం) ఉన్నారన్నారు. మృతుని ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పిఎం విశ్వకర్మ దరఖాస్తుల వెరిఫికేషన్ సత్వరమే పూర్తి చేయాలి

**-క్షేత్రస్థాయిలో వెళ్లి భౌతిక ధ్రువీకరణ చేయాలి**

**-జిల్లా కలెక్టర్ అనుదిప్ దురుశెట్టి**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల వెరిఫికేషన్ వేగవంతంగా పూర్తిచేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 19,206 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 236 మందికి మాత్రమే రుణాలు అందించిన పట్ల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో యుద్ధ ప్రాతిపాదికన వెరిఫికేషన్ చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. 19,206 దరఖాస్తులలో ఇంకా మిగిలి ఉన్న 10491 స్టేజ్‌వన్ స్థాయిలో పరిశీలించి 15 రోజుల్లోగా జిల్లా స్థాయికి పంపాలని జిహెచ్ఎంసి10, ర్యాండం చెక్ చేసి జిఎండిఐసి పంపాలని అన్నారు. 15 రోజుల్లోగా దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి కావాలన్నారు. 15 రోజుల తర్వాత సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి అధికారులు చేపట్టిన చర్యలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిఎండిఏసి ప్రవీణ్, డిస్టిక్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఆశన్న, ఎల్ డి ఎం, పీఎం సుబ్రహ్మణ్యం , ఎం శ్రీనివాసరావు ఎమ్మెస్ ఎంఈ డైరెక్టర్, వినోద్ యాదవ్, ఉషేకల పాండు, జమలాపూర్ శేఖర్, వి ప్రశాంత్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## హోటల్స్ ముందు అక్రమంగా వాహనాల పార్కింగ్



అబిడ్స్‌లో ప్రధాన హోటల్ వద్ద నో పార్కింగ్ అక్రమ పార్కింగ్

**గోషామహల్, నవంబర్ 12ప్రభాతవార్త:** ట్రాఫిక్ నియమ నిబంధలను ఉల్లంఘీస్తూ నగరం నడి బొడ్డున్న ఉన్న ప్రధాన హోటల్ వద్ద వాహనదారులు అక్రమంగా తమ వాహనాలను పార్కింగ్ చేసివెళ్తున్నారు. అబిడ్స్ చౌరస్తా నుంచి బ్యాంకు స్ట్రీట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న పేరుగాంచిన హోటల్ వద్దప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి హోటల్ ముందు తమ వాహనాలను పార్కింగ్ చేసి హోటల్‌లో ఆల్పహారం, మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడం మూలంగాతరుచుగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ హోటల్‌కు సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో హోటల్‌ముందు పార్కింగ్ చేయడం పరిపాటిగా మారింది. అటు లాఅండ్ ఆర్డర్ పోలీసులు, ఇటు అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు నగరంలోని ప్రధాన అబిడ్స్‌లో జనరల్ పోస్టు ఆఫీస్‌ఉండటం మూలంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పోస్టుఆఫీసుకు తమ పనులను నిమిత్తం వస్తుంటారు. అటు పోస్టుకు వచ్చే వాహనాలు, ఇటు హోటల్‌లో ఆల్పహారం, మధ్యాహ్నం సమయంలో బిర్యాన్ని తినేందుకు వచ్చే బిర్యాన్ని ప్రియులు తమ వాహనాలను హోటల్ ముందు నిలిపి లోనికి వెళ్లడంతో ప్రధాన రహదారిలో పాదాచారులకు అనేక ఇబ్బందులకు గురువుతున్నారు. పాదాచారుల స్థలంలో చికెన్‌కు సంబంధించిన వంటసామాగ్రితోపాటు ఐస్‌క్రీమ్ డబ్బాను పెట్టి అమ్మకాలు చేస్తుంటారు. దీంతో పాదాచారులకు, ప్రజలకు అనేకఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారి కావడం మూలంగా తరుచుగా ఆరహదారిలో ట్రాఫిక్ సమస్యలుఉత్పన్నమవుతున్నాయి. దీనికి తోడు అబిడ్స్ నుంచి ఎంజె మార్కెట్ చౌరస్తా వైపు వెళ్లే వాహనాలను అబిడ్స్ జనరల్ పోస్ట్ ఆఫీసు ప్రక్కనే ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నిలిపి చాలన్లు వేస్తుంటారు. కాని అటు వైపుఉన్న రహదారిన్ని అక్రమించుకుని వ్యాపారం చేస్తున్న హోటల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దీనికి తోడుఏడాది జనవరి 1వ తేదిన అర్ధరాత్రి సమయంలో హోటల్‌కు వచ్చిన బిర్యాన్ని ప్రియులపై దాడులు చేసి సంఘటన లు ఉన్నాయి. మాముళ్లగా ఏదైనా ప్రాంతంలో వాహనాలను నిలిపి వేస్తే వెంటనే ట్రాఫిక్ వాహనానంపై వచ్చివాహనాలను క్రేన్‌లో ఎక్కించుకుని వెళ్తుంటారు. కాని హోటల్ వద్ద ఇరువైపులా అక్రమించుకున్న ట్రాఫిక్ పోలీసులకు, లాఅండ్ అర్డర్ పోలీసులకు కనిపించడంలేదా అన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని నో పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలుపకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రెచ్చిపోతున్న అవినీతి చేపలు

**-కమిషనర్, జెడ్సీ చెప్పినా పటించుకోం.. అంతా మా ఇష్టం**
**-మూసాపేట సర్కిల్ 23లో అక్రమ నిర్మాణాలు కోకొల్లలు**
**-ఉదయం తనిఖీలు. సాయంత్రం సెటిల్‌మెంట్లు.. రాత్రి వసూళ్ళు..**

**హైదరాబాద్, నవంబర్12 ప్రభాతవార్త**
మూసాపేట సర్కిల్ 23 పరిధిలోని అనేక ప్రాంతాల్లో అడ్డూ అదుపులేకుండా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ మహిళా అధికారి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో అంతర్యమేమిటోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఉదయం నిర్మాణాల తనిఖీలు, సాయంత్రం సెటిల్‌మెంట్లతో కొందరు అధికారులు, సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బ్రోకర్లు, లైసెన్స్ ప్లానర్లతో తమ కింద పనిచేసే సిబ్బందితో అధికారులు రాత్రి వేళల్లో అక్రమ నిర్మాణాలు సక్రమంగా సాగేందుకు అక్రమ వసూళ్లు చేయిస్తున్నట్లు సమాచారం. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్వయంగా జీహెచ్ఎంసీ కమిషనర్‌తోపాటు జోనల్ కమిషనర్ ఆదేశాల్ని అధికారులు పట్టించుకోవడంలేదు. జెట్ వేగంతో అభివృద్ధి చెందుతున్న మూసాపేట సర్కిల్‌లోని కెపిహెచ్‌బికాలనీ, మూసాపేట, బాలాజీనగర్ డివిజన్లలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను సర్కిల్ 23 కార్యాలయంలో కీలక బాధ్యతల్ని ఓ అధికారి, ఓ మహిళా అధికారితోపాటు బహుళ అంతస్తుల భవనాలు, వ్యక్తిగత గృహాల నిర్మాణాలు సక్రమంగా సాగేందుకు తమ సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో వ్యక్తిగత గృహాలతోపాటు వ్యాపార, వాణిజ్య సముదాయాలు అపార్ట్‌మెంట్లు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. దీంతో అధిక శాతం నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నప్పటికీ.. పెద్దఎత్తున పెరుగుతున్న నిర్మాణాలను అనుగుణంగా జీహెచ్ఎంసీ ఆదాయం కూడా పెరగాల్సి ఉంటుంది. అయితే మూసాపేట సర్కిల్‌లోని కొందరు అధికారులు చేతివాటానికి అలవాటు పడి అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించి గ్రేటర్ ఆదాయానికి రూ.కోట్లలో గండికొడుతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కిందిస్థాయి ఉద్యోగులు అక్కడ చేరి హెడ్ ఆఫీసులో కలవాలని హుకుం జారీ చేస్తారు. ముడుపులు అప్పగిస్తేనే అక్రమ నిర్మాణం సక్రమంగా కొనసాగుతుంది. అనేక ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా జీప్లస్ టూ వరకు అనుమతులు తీసుకుని ఐదారు అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే అధికారులు ఏ మేర అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారో అర్థమవుతుంది. అనేక మంది బిల్డర్లు అయితే నిబంధనల్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారు. సెల్లార్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అడ్డుకునే నాధుడే కరువయ్యాడు. తీసుకున్న అనుమతులకు కంటే అదనంగా అంతస్తుల్ని నిర్మిస్తున్నా పట్టించుకోవడంలేదు. అక్రమ నిర్మాణాలను అడ్డుకునే దానికంటే అందినంత దండుకోవడమే మేలు అన్న చందంగా కొందరు వ్యవహరిస్తుండడం వల్లే అడ్డదిడ్డంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.


జీహెచ్ఎంసి కార్యాలయం

**రెచ్చిపోతున్న అవినీతి చేపలు**
**పట్టించుకోని జీహెచ్ఎంసి పెద్దలు..**
మూసాపేట సర్కిల్ 23 కార్యాలయంలో ఓ మహిళా అధికారితోపాటు కొందరు వ్యక్తిగత గృహాల నిర్మాణాలకు సంబంధించి ఒక్కో దానికి లక్షలాది రూపాయల్ని రేటు కట్టి తమ వసూళ్ళ దందాను కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ నెలకొన్న అవినీతి వల్ల అనేక ప్రాంతాల్లో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నప్పటికీ జీహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయంతోపాటు కూకట్‌పల్లి జోన్ అధికారులు పట్టించుకోవడంలేదు. అక్రమ నిర్మానాలను గుర్తించి బిల్డర్లు నిర్మానదారులతో బేరసారాలకు దిగి అందినంత దండుకుంటున్న అవినీతి తిమింగలాలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో తనకు అడ్డే లేదన్న ధీమాతో ఓ మహిళా అధికారి అక్రమ నిర్మాణాల సక్రమంగా సాగేందుకు తన వంతు సహకారం అదిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఉన్నతాధికారులు సర్కిల్ పరిధిలో పర్యటించి అక్రమ నిర్మాణాల విషయంలో దృష్టిసారించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఈ విషయంలో దృష్టిసారించడంలేదు. సర్కిల్ 23 టౌన్‌ప్లానింగ్ విభాగంలో నెలకొన్న అక్రమాలపై గ్రేటర్ ఉన్నతాధికారులు మౌనం వహించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో కొందరు మామూళ్ల రేట్లను మరింతగా పెంచి తమ వసూళ్ళ దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నట్లు తెలిసింది. బిల్డర్లతోపాటు అక్రమ నిర్మానదారుల వద్ద రూ.కోట్లాది రూపాయల్ని కొందరు అధికారులు, సిబ్బంది ఏ మేర గడ్డి మేశారో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

**సికింద్రాబాద్, నవంబర్ 12 (ప్రభాతవార్త):** పేదలు,బడుగు బలహీన వర్గాల స్థితిగతులను అధ్యయనం చేసివారికి ప్రభుత్వం సరైన రీతిలో సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టీపీసీసీ కేకేసీ సికింద్రాబాద్ డీసీసీ జిల్లా ఛైర్మన్ గంట రాము సాగర్ కోరారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన చేసేమాని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధి కల్పన తదితర అంశాలపై సమగ్రమైన సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటేనే అర్హులకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో సమగ్రమైన వివరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సర్వే గురించి ప్రజలు అపోహలు పెట్టుకోవద్దని, సర్వేకు పూర్తిగా సహకరించాలని గంట రాముసాగర్ పిలుపు చేశారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

**పురానాపూల్,నవంబర్ 12(ప్రభాతవార్త):** దాదాపు పురానాపూల్ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తెలిపారు.ఈ మేరకు డివిజన్ పరిధిలోని సన్నం గల్లీ వీధిలో చేపడుతున్న సిసి రోడ్డు అభివృద్ధి పనులను ఆయన అధికారులు, మజ్లీస్ కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేసి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు వేసే ముందుపైపు లైన్‌లను నిర్మించుకోవాలన్నారు.కొత్త సిసి రోడ్డు వేసిన తరువాత ఎలాంటి పనులను చేపట్టవద్దని సూచించారు.ఈకార్యక్రమంలో మజ్లీస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తాం

**బేగంబజార్,నవంబర్ 12ప్రభాతవార్త:** చెవ్వు,ముక్కు,గొంతు నొప్పితో భాదపడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకుమెరుగైన వైద్యసేవలను అందించడం జరుగుతుందని కోఠి ఇ.ఎన్.టి ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఆనందచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ముక్కు, గొంతు, చెవ్వు నొప్పితో భాదపడుతూవచ్చే సుమారుగా 500 మంది రోగులకు ఓపి విభాగంలో వైద్యసేవలను అందించడం జరుగుతుందన్నారు.రోగిపరిస్థితి పట్టి అత్యవసర శ్రస్త చికిత్సలు చేయడం జరుగుతుందని వివరించారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించేందుకు గాను కృషి చేస్తానన్నారు.ప్రతి రోజు ఓపి ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగుతుందన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అభివృద్ధికి కృషి

**- కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి**


పాదయాత్రలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 12 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు .మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాలాజీ కాలనీలో కొత్తగా నిర్మించిన సిసి రహదారులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించటానికి పాటు పడుతున్నానని తెలిపారు.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.రహదారి వేయవలసిన ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్దన్,జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్,హరీష్,తలారి చిన్న, పాండు యాదవ్,రఘు,సుజాత, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే


కిడ్నీ మార్పిడి కోసం రెండున్నర లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**నార్సింగి,నవంబరు 12 ప్రభాతవార్త :**
ఆపదలలో ఉన్న నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.బండ్లగూడ కార్పొరేషన్ సాయిరాం నగర్‌కు చెందిన జ్యోతికి నిమ్స్‌లో కిడ్నీ మార్పిడి చేశారు.ఈ చికిత్సకు జ్యోతికి ఐదు లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయి.ఇందులో 2.50 లక్షల రూపాయలు ఎల్ఓసీ చెక్కును స్థానిక కార్పొరేటర్ శ్రీ నాథ్‌రెడ్డితో కలిసి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జ్యోతి భర్తకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు.సిఎం సహాయ నిధి కింద పేదలకు కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యంను అందజేస్తుందన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు తమ వివరాలను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.ప్రజలు ఇచ్చిన వివరాలు ఆధారంగానే భవిష్యత్తులో ఫించన్లు,రేషన్ కార్డులు,ఇళ్లు ఇవ్వటం జరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.కృష్ణారెడ్డి,కార్పొరేటర్ సాగర్ గౌడ్,నాయకులు రామ్ ప్రసాద్,విష్ణు,ప్రేమ్ కుమార్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు : ఎమ్మెల్యే

**కొంపల్లి, నవంబర్ 12, ప్రభాతవార్త :** 127 రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్‌లోని ఠాగూర్ హై స్కూల్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బెస్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు తో విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయవచ్చని రానున్న రోజుల్లో ప్రతి రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తప్పనిసరి కానుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తకాలతో పాటు కంప్యూటర్, శాస్త్ర సాంకేతిక రంగాలను పునికి పుచ్చుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాంది పలికిన ఠాగూర్ స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు ప్రొఫెసర్ డాక్టర్ ఇందిరారాణి, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీని వాస్, ఐటిఐ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు శ్రీనివాస్, ఆగర్ సైబర్ ఎక్స్ సంస్థ ఐటీ డైరెక్టర్ సుమన్,ఎర్వ శంకరయ్య, అబ్దుల్ ఖాదర్, లక్ష్మీనాథ్, రహీం, కార్తీక్‌గౌడ్ పాల్గొన్నారు.

## సంస్థాగతంగా బిజెపిని బలోపేతం చేయాలి : గౌతమ్ రావు

**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:**
సంస్థాగతంగా భారతీయ జనతా పార్టీని పటిష్టం చేసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బీజేపి నగర కార్యాలయంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికలు 2024 కు సంబంధించి వర్క్‌షాప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ బూత్ స్థాయిలో బలమైన శక్తిగా అవతరించినప్పుడే ఎన్నికలలో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక్కసారి భారతీయ జనతా పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని, బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఎన్నికలు జరుగుతాయని గౌతమ్ రావు వివరించారు. అదేవిధంగా జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా శ్రీకాంత్ నియమితులయ్యినట్లు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ బీజేపీ అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, రాష్ట్ర సహ కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, శ్రీకాంత్, కార్పోరేటర్ ఉమా రమేష్ యాదవ్, కృష్ణ గౌడ్, సందీప్ సాయి, నంద కిషోర్ యాదవ్, పందిర్ల ప్రసాద్, చిట్టి శ్రీధర్, వనం రమేష్, రమేష్ యాదవ్, యశ్వంత్, ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడున్న గౌతంరావు, రాంచంద్రారెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులు

## షియా ముస్లింలకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ కేటాయించాలి

**షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ డిమాండ్**


సమావేశంలో మాట్లాడతున్న షబ్బీర్ అలీమీర్జా, హిదాయత్ అలీ మీర్జా, మహ్మద్ అలీ హైదర్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:**
షియా ముస్లిమ్ రాజకీయంగా ఎదిగేందుకు గవర్నర్ కోటా లో ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించాలని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ చైర్మన్ షబ్బీర్ అలీమీర్జా డిమాండ్ చేశారు.ఈమేరకు మంగళవారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైక్రో మైనార్టీగా ఉన్న షియాలను అన్ని సంస్థలు, ప్రభుత్వ శాఖలల్లో ప్రాధాన్యత పోస్టులు, రాజకీయంగా నామినేటెడ్ పోస్టులను ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. తాము 10లక్షలకు పైగా ఉన్నప్పటికీ ఎలాంటి పథకాలు అందకపోవడంతోపాటు, చదువుకునే విద్యార్థులకు ఉపకార వేతనాలు సైతం అందడం లేదన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై హైకోర్టులోపిటిషన్ వేయగా కేంద్ర రాష్ట్ర శాఖలకు అక్టోబర్ 4న హాజరుకావాలని అన్ని శాఖలకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. కావున ప్రభుత్వాలు కోర్టు ఆదేశాలను అనుసరించి షియాముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు హిదాయత్ అలీ మీర్జా, సయ్యద్ షకీల్ హైదర్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ అబిద్ హుస్సేన్, జనరల్ సెక్రటరీ మహ్మద్ అలీ హైదర్, నేషనల్ కన్వీనర్ సయ్యద్ హైదర్ రాజానక్వీ, అక్బర్ అలీ మీర్జా తదితరులు పాల్గొన్నారు.

### కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు



**పేట్ బషీరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద పలువురు నాయకులు, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలివారు. ఈ సందర్భంగా పలు వినతులు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం, కాలనీల అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. అనంతరం పలు శుభకార్యాలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనగుప్తా, శ్రీరాములు, యాదగిరి, నరసింహారెడ్డి, సురేష్, లింగం రవి, మల్లికార్జునరావు, మూర్తి, వెంకట్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి : సిపిఐ


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

**నిజాంపేట్, నవంబర్ 12, ప్రభాతవార్త**
బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ సర్వే నెంబర్ 109లో ప్రభుత్వ భూమిని 7 ఎకరాల 36 గుంటలు స్థలం కబ్జా చేసి జరుపుతున్న అక్రమ నిర్మాణాలపై బాచుపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు మంగళవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలో అనేక చోట్ల ప్రభుత్వ భూమి ప్రైవేట్ పత్రాలతో కబ్జా చేయడం అలవాటుగా మారింది. నిజాంపేట్ సర్వే నెంబర్ 109లో చాలా వరకు కబ్జా జరిగిందని, దీనిపై అనేక సార్లు కలెక్టర్‌కు, మండల తహసీల్దార్‌కు, కమీషనర్‌కు ఫిర్యాద చేయడం జరిగింది. కానీ తుతుమంత్రంగా కులగొట్టడం జరిగిందని గుర్తు చేశారు. వెంటనే అట్టి ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని లేని పక్షంలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశీ యాదయ్య, వాసు, ఢిల్లేశ్వర్ రావులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయండి : బిక్షపతి యాదవ్

**నిజాంపేట్, నవంబర్ 12, ప్రభాతవార్త**
నిజాంపేట్ బిజెపి అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌ని మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌ని కలిసి వివిధ కాలనీలలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో పెద్దపీట వేయాలని వారు నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు బిజెపి తరుపున ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచిన్, ప్రసాద్, వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం..

**జీడిమెట్ల, నవంబర్ 12, ప్రభాతవార్త**
ప్రశాంత్ నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో జెఎస్పీ ఇంజనీరింగ్ అండ్ సర్వీస్ ఇండస్ట్రియల్ కంపెనీలో పిల్ల శభాష్టియన్ అనే కార్మికుడు గత ఏడు సంవత్సరాలుగా జెఎస్పీ ఇంజనీరింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అకారణంగా విధుల నుంచి తొలగించడం జరిగింది. శభాష్టియన్ కార్మిక నాయకులు చింతల నాగరాజుని ఆశ్రయించగా కంపెనీ ఎండి ఆంజనేయులుచే చర్చలు జరిపి, ఆ కార్మికుడికి 1,50,000 రూపాయలు నష్టపరిహారం ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగ నాగరాజు మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యాలు కార్మికులచే శ్రమ దోపిడీకి పాల్పడుతూ అన్యాయంగా విధుల నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన తెలంగాణ ప్రభుత్వం కార్మికుల పేద ప్రజల పక్షపాతిగా పనిచేస్తుందని అన్నారు. కార్మికులకు ఏ కష్టం వచ్చిన తన వంతు న్యాయం చేయడానికి ముందుంటానని తెలిపారు. కాగా సోమవారం కార్మికుడికి నాగరాజు నివాసంలో చెక్కును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటీరియల్ డిజైనర్ శేషురావు, దేవేందర్, సాయినాథ్, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కోడ్‌లు లేకుండా ముద్రించిన సర్వే పత్రాన్ని మార్చాలి

**చిక్కడపల్లి, నవంబరు 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో 21 రకాల వికలాంగుల వివరాలు ఎక్కడ కూడా లేవని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్‌డి) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై మంగళవారం వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజకు ఈమెయిల్, వాట్సాప్ ద్వారా వినతిపత్రాన్ని పంపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కేంద్రకార్యాలయంలో మాట్లాడారు. కుటుంబ యజమాని, కుటుంబ సభునయల వ్యక్తిగత వివరాలు సేకరించడానికి పార్ట్-1 ఫాంలో 13వ నెంబరు కాలమ్‌లో దివ్యాంగులు అని అడిగారని, 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 21 రకాల వైకల్యాలను గుర్తించిందని, సర్వే పత్రంలోని కాలమ్-13లలో కోడ్ నింపడానికి షెడ్యూల్ నింపడానికి సూచనలు పేరుతో ప్రత్యేకంగా హ్యాండ్‌బుక్ ఇచ్చారని, ఈపుస్తకంలో మిగతా వివరాలు సమగ్రంగా ఉన్నప్పటికీ వికలాంగుల వివరాలు మాత్రం సమగ్రంగా లేవన్నారు. ప్రభుత్వం 21 రకాల వికలాంగులను విస్మరించడం దురదృష్టకరమని, సర్వేలో వైకల్యాలను గుర్తించకుండా ప్రభుత్వం ఈ వర్గాలను మోసం చేసిందని, సకలాంగులకు, కులాలకు ఇచ్చిన ప్రాధాన్యత వీరికి ఎందుకు ఇవ్వడం లేదని విమర్శించారు. వికలాంగుల వివరాలు లేకుండా ప్రింట్ చేయడం అంటే వికలాంగులపట్ల వివక్షత తప్ప మరొకటి కాదని, ప్రభుత్వమే వికలాంగుల పట్ల వివక్షత చూపడాన్ని ఖండించారు. సర్వేలో 21 రకాల వికలాంగుల వివరాలు సేకరించడానికి ప్రతి వైకల్యానికి ఒక కోడ్ ఉండాల్సిన అవసరం ఉందని, వైకల్యాలను వెంటనే కోడ్‌లు కేటాయించి సర్వే కొనసాగించాలని డిమాండ్ చేశారు. 21 రకాల వైకల్యాలను సేకరించకుండా సర్వేకు వస్తున్న సిబ్బందిని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఎస్‌డి జాతీయ కన్వీనర్‌లు వి.భారతి, కాటమోని వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్‌డి) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

## తెలుగు భాషలో సమగ్రమైన పద కోశం అవసరం : న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

**చిక్కడపల్లి, నవంబరు 12 ప్రభాతవార్త:** తెలుగు భాషలో సమగ్రమైన పదకోశం అవసరం ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ఇటీవలే పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ మాతృభాషలో తీర్పులు అనువాదం చేయాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల వారి భాషలకు చెందిన పదకోశం సమగ్రంగా ఉన్నందున అక్కడ తీర్పులు త్వరితం అనువాదం అవుతున్నాయని అన్నారు. ఫిర్యాదుదారులు తమ భాషలో తీర్పులు తెలుసుకోవడం అవసరమన్నారు.మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వంశీ ఇంటర్నేషనల్ ఇండియా సంస్థల నిర్వహణలో 52 మంది కథా రచయితలు రాసిన 'కొత్త కథలు-6వ భాగం ఆవిష్కరణ సభ ఆ సంస్థల నిర్వాహకులు కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, డాక్టర్ తెన్నేటి సుధాదేవి ఆధ్వర్యంలో జరిగింది. 'కొత్త కథలు' సంపుటిని లాంఛనంగా డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి(అమెరికా)కు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ కె.లక్ష్మణ్ హాజరై కథా సంపుటిని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. వాస్తవాన్ని కథల రూపంలో అందించే రచయితలు సమాజ హితానికి దోహదపడతారన్నారు. నేడు అత్యధిక కేసులు ఫ్యామిలీ కోర్టులో ఉండటానికి కారణం సమాజానికి సరైన దిశానిర్దేశం లేకపోవడం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ సమాజ జీవితానికి మనిషి జీవితానికి సంబంధం తెలిపేదే కథ అన్నారు. భారతీయ సాహిత్యచరిత్ర కథతోనే ఆరంభం అయిందనానరు. ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య సూర్య ధనంజయ్, తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య నిత్యానందరావు, నాట్యగురువు ప్రసన్న రాణి, జర్నలిస్ట్ మా శర్మ, దర్శకుడు రేలంగి నర్సింహారావు, జెవి.పబ్లికేషన్స్ నుంచి జ్యోతి వలబోజు తదితరులు పాల్గొన్నారు. గ్రంథ స్వీకర్త డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తనకు తెలుగు సాహిత్యం అంటే విపరీత అభిమానం అని, అమెరికాలో స్థిరనివాసంగా ఉన్నా సినారె, వంశీ సంస్థల సంపుటిల ప్రచూరణకు సహకారం అందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో తొలుత అలనాటి నటీ జమున సంస్మరణలో గాయనీ ఆకునూరి శారద(అమెరికా) సహ గాయకులు రామకృష్ణ, సాయి మేఘన, తుషార నిలయ తదితరులచే జమున నటించిన సినిమా పాటల విభావరి అందరిని అలరించింది.


'కొత్త కథలు' కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్, చిత్రంలో డాక్టర్ ఆళ్ళ రామకృష్ణారెడ్డి, వంశీ రామరాజు, ఓలేటి పార్వతీశం, ఉపకులపతులు వెల్దండ నిత్యానందరావు, సూర్యధనంజయ్ తదితరులు

## నార్సింగి మార్కెట్ అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తా

**- నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే**


నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లను అభినందిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, నవంబర్ 12 ప్రభాతవార్త :** నార్సింగి మార్కెట్ కమిటీ అభ్యున్నతికి నావంతు పూర్తి సహకారం అందజేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్, డైరెక్టర్లు నర్సిహ్మా ధర్మపురి, బుద్దోలు రాజు, శేఖర్‌బాబు యాదవ్, సాధిక్, ఏర్పుల కుమార్, మాచెర్ల రాజు, దారుగుపల్లి బాల్‌రాజ్, లక్ష్మీ, శ్రీకాంత్ గౌడ్, బాల్‌రెడ్డి, తలారి ప్రేమ్, అరికె మల్లేష్‌లను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు మార్కెట్ యార్డు అభివృద్ధికి ఏ నిర్ణయం తీసుకున్నా పూర్తి సహకారం అందజేస్తానని పేర్కొన్నారు. నార్సింగి, శంషాబాద్ రెండు ప్రాంతాలలో ఉన్న మార్కెట్లను ఆధునీకరించి, ఆదాయంను గణనీయంగా పెంచేందుకు నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కట్ట వేణుగౌడ్ మాట్లాడుతూ మాపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు ఇచ్చిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పెద్దలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సభ్యులు, అధికారులు అందరి సలహాలు, సూచనలు పాటిస్తూ మార్కెట్‌ను వేగంగా అభివృద్ధి చేస్తామని కట్ట వేణుగౌడ్ స్పష్టం చేశారు.

## పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలి


వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించిన జల మండలి ఉద్యోగులు

**సైఫాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఐఎన్‌టియుసి జలమండలి కాంగార్ యూనియన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం.నరేందర్‌రెడ్డికి ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జలమండలి కాంగార్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడి నేతృత్వంలో యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు బి.భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.సురేష్‌బాబు, ముఖ్య ఉపాధ్యక్షుడు ఆర్.సిత్యా, కోశాధికారి టి.సురేష్ తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలమండలి ఉద్యోగులకు ప్రభుత్వ ఫ్రి హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న 3 వేల పోస్టులను భర్తీ చేయాలని, జెటిఓ, ఏటిఓ, అప్ గ్రెడేషన్, ఎన్ఎంఆర్, హెచ్ఆర్ మహిళా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని నరేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో జల మండలి ఉద్యోగుల సమస్యలను పరిష్కారించడంతోపాటు వేలాది మంది తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన ఈ సందర్బంగా గుర్తు చేశారు. మానవతా దృక్పథంతో సిఎం వెంటనే జల మండలి ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు.

## రిటైర్డ్ ఆర్టీసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలి : కోటయ్య



ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో ప్రసంగిస్తున్న కోటయ్య తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:** ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.కోటయ్య, బుచ్చిరెడ్డి,అధ్యక్షులు బి.ఎల్. నారాయణలు పిలుపునిచ్చారు. మంగళవారం సికింద్రాబాద్ పికెట్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆర్టీసి సంస్థలో 30 సంవత్స రాల పాటు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఆర్టీసి యాజమాన్యం చిన్న చూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసి తార్నాక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిల సాధన కోసం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 250 మంది రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.ఎల్.నారాయణ,ప్రధాన కార్యదర్శిగా ఆర్. రాజశేఖర్ రెడ్డి, కోశాధికారిగా జి.బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులుగా కె. మధుసూదన్ రెడ్డి, ఎల్.వెంకట్ రెడ్డి,ప్రచార కార్యదర్శిగా ఇప్పల రాములు, సహాయ కార్యదర్శులుగా ఎల్.వెంకట్‌రెడ్డి, ఎన్.వెంకటయ్యలతో పాటు మరో 8 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులైనట్లు బి.ఎల్. నారాయణ తెలిపారు.

## రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులకు పలు సూచనలు సలహాలు ఇస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 12, ప్రభాతవార్త**

రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం 124 ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముల్లపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు వద్ద ప్రధాన రహదారిలో ఇటీవల జరుగుతున్న రోడ్డు విస్తరణ, పైప్‌లైన్ నిర్మాణ పనుల వల్ల వాహనదారులకు ఇబ్బంది ఏర్పడిందని అన్నారు. అతి త్వరలోనే నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు పూర్తి చేయాలి : కార్పొరేటర్



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీ

**సంజీవరెడ్డి నగర్, నవంబర్ 12, ప్రభాతవార్త**

సీసీ రోడ్డు పనులలో నాణ్యత పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ కోలన్ లక్ష్మీ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం సనత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కోలను లక్ష్మీ శివాజీ నగర్‌లో శివాజీ విగ్రహం నుంచి ఎస్.ఆర్.టి. క్వార్టర్స్ రెడ్ వరకు కాలనీవాసులతో కలిసి 12లక్షల వ్యయంతో కూడిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులను అందించేందుకు నిరంతరం పనిచేస్తున్నామని అన్నారు. ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, ఏఈ భాస్కర్, బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బుచ్చిలింగం, ప్రకాష్‌రెడ్డి, రాజు, మధు, వంశీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, పురుషోత్తం, రవి, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్రులను ఎంబిసి జాబితాలో చేర్చాలి

**- గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ ఖన్నా**



బిసికమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేష్ కన్నా గంగపుత్ర

**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:**

గంగపుత్రులను ఎంబిసి జాబితాల్లో చేర్చాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ కన్నా అన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ బి సి కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ నిరంజన్‌ను మర్యాదపుర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ గత ప్రభుత్వము 36 బి సి కులాలను ఎంబిసి జాబితాలో చేర్చుతూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. సాంప్రదాయ మత్యకార గంగపుత్రులు కేవలం చేపల వేటే కుల వృత్తిగా జీవనం సాగిస్తూ పేదరికంలో ఉండి విద్య రాజకీయ ఆర్థిక సామజిక రంగలలో అత్యంత వెనుకబడి ఉన్నారన్నారు. దేశములో చాలా రాష్ట్రాలలో సాంప్రదాయ మత్యకార గంగపుత్ర కులస్తులను ఎస్‌టి, ఎస్‌సిలుగా గుర్తించారన్నారు .తెలంగాణలోనూ బిసి-ఏ సీరియల్ నెంబర్ ఒకటిలో ఉన్న గంగపుత్రులను ఎంబిసి జాబితాలో చేర్చాలని బి సి కమిషన్ ఛైర్మన్ కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

### రేషన్ బియ్యం నిల్వ ఉంచిన ఇద్దరు అరెస్ట్

**ముషీరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:** అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన ఇద్దరు యువకులను గాంధీనగర్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం భోలక్‌పూర్‌లో నివసించే ఎండి. ముజాహెద్ హుస్సేన్ (24), ముషీరాబాద్‌లోని ఇంద్రనగర్‌లో నివసించే మహ్మద్ ఫక్రుద్దీన్ (19) లు ఇద్దరూ కలసి భోలక్‌పూర్‌లోని కృష్ణనగర్‌లో ఒక ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న గాంధీనగర్ పోలీసులు మంగళవారం ఆ ఇంటిపై రైడ్ చేసి, అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల బియ్యంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు.

## కంటోన్మెంట్ బోర్డును జిహెచ్‌ఎంసీలో విలీనం చేయాలి : శ్రీగణేష్



కంటోన్మెంట్‌లో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీతో బేటీ అయిన ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును వెంటనే జిహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని,లేని పక్షంలో వెంటనే బోర్డు ఎన్నికలు నిర్వహించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు ప్రసాద్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బోర్డు కార్యాలయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మెంబర్‌తో పాటు సిఈఓ మధుకర్ నాయక్‌లతో సమావేశమై కీలక అంశాలపై చర్చించారు. ప్రజా స్వామ్య దేశంలో ప్రతి 5 సంవత్సరాలకు ఒక సారి స్థానిక బోర్డు ఎన్నికలు జరుగాల్సి ఉంది. 2015 లో ఎన్నికలు జరుగగా వారి పదవి కాలం ముగిసేలోపే 2020లో ఎన్నికలు జరుగాల్సి ఉంది. ఇంత వరకు బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రజా స్వామ్యానికి విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్ బోర్డుకు 900 కోట్లు సర్వీస్ ఛార్జీలు రావాల్సి ఉందన్నారు. వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని వారి దృష్టికి తెచ్చారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కంటోన్మెంట్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కోసం 10 ఎకరాల స్థలం కెటాయించంచాలని వారి దృష్టికి తెచ్చా రు. బోర్డు ప్రాంతాలకు గతంలో 5.9 ఎంజిడి నీటి సరఫర కాగా ప్రస్తుతం 6.9 ఎంజిడీల నీటి సరఫరాను పెంచడం జరిగిందన్నారు. నీటి అదే విధంగా నీటి బిల్లులపై వన్‌టైమ్ సెటిల్ స్కీమ్ విషయంలో సహకరించి బిల్లుల్లో తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

### ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి : జంపన

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. కార్తీక మాసంను పురస్కరించుకొని మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లి లోని శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డుమాజీ సభ్యురాలు జంపన విద్యావతి, సీనియర్ కాంగ్రెస్ నేత బద్రినాథ్ యాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు రాజే శ్వరశర్మలు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలకు వంద లాది మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కంటోన్మెంట్‌ను జిహెచ్‌ఎంసీలో విలీనం చేస్తేనే అభివృద్ధి : శ్రీగణేష్

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్నీ జిహెచ్‌ఎంసిలో విలీనం చేస్తే అభివృద్ధి జరుగుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం బోర్డులోఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో బోర్డు పాలకమండలి పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బోర్డు ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జిహెచ్‌ఎంసీలో విలీనం చేస్తేనే సాధ్యం అవుతుందన్నారు. రక్షణ శాఖ స్థలాల్లో లీజ్‌కు తీసుకున్న బంగ్లాలు కమర్షియల్‌గా వాడుకుంటున్నారన్నారు. వాటిని కట్టుదిట్టం చేసేందుకు బోర్డు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తెలుకుంట సతీష్ గుప్త, సంకి రవిందర్,ముప్పిడి మధుకర్, నరేశ్, నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

### లెజెండరీ, ఎక్సలెన్సీ అవార్డులకు ఆహ్వానం

**రవీంద్రభారతి, నవంబరు 12 ప్రభాతవార్త :** డా. ఎపిజె. అబ్దుల్‌కలాం, సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రఖ్యాత అభిలాష హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ సమాజంలోని ప్రతీరంగంలో నిత్యం అనేక మంది చేస్తున్న నిస్వార్ధ సేవలకు గుర్తింపుగా లెజెండ్, ఎక్సలెన్సీ అవార్డులను అందజేసి మరింత ప్రోత్సహించే ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. ఎస్.సరోజనమ్మ మీడియా తెలిపారు. ఈమేరకు సామాజిక సేవలో పేర్గాంచిన పలువురు ప్రముఖుల పేర్లతో సామాజిక సేవకులు, ఎన్జీఓలు, పారిశ్రామికవేత్తలు, నాయకులు, సంఘసంస్కర్తలు, రచయితలు, డైరెక్టర్లు, డాక్టర్లు, వివిధ కళాకారులు, విద్య వైద్య న్యాయవాద, ఉపాధ్యాయ, జ్యోతిష్య వాస్తు నిపుణులు, సినీ ఆర్టిస్టులు తదితర రంగాలకు చెందిన వారిని ఆహ్వానిస్తూ అందులో సుమారు మూడువందల మంది విశిష్ట వ్యక్తులను ఎంపికచేసి భారతదేశ పూర్వ రాష్ట్రపతి డా. ఎపిజె. అబ్దుల్‌కలాం 93వ జయంతి, సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకొని లెజెండరీ, ఎక్సలెన్సీ అవార్డులతో సత్కరించనున్నట్లు, ఆసక్తిగల వారు ఈ పురస్కారాల కోసం తమ అర్హతలను పూర్తిగా వివరిస్తూ ఈ నెల 16 శనివారంలోగా దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు మొబైల్ నంబరు 6302908528లో సంప్రదించాలని డా. సరోజనమ్మ కోరారు.

## మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : ఎమ్మెల్యే వివేకానంద



చెరువులోకి చేపలను వదులుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, నవంబర్ 12, ప్రభాతవార్త :** 125 గాజులరామారం డివిజన్ చింతల చెరువు వద్ద నిర్వహించిన చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై మంగళవారం చింతల చెరువలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో చెరువులలో మురుగునీరు కలవకుండా ఎస్టిపిలను నిర్మించడం జరిగిందని, తద్వారా మంచి చేపలు చెరువులలో లభ్యమవ్వడంతో పాటు పరిసరాలు మురుగుమయం కాకుండా ఆహ్లాదభరిత వాతావరణం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా ముదిరాజులను బిసి-డి నుంచి బీసీ-ఏలోకి మార్చాలనే డిమాండ్‌ను ఇప్పటికే అసెంబ్లీలో చర్చించడం జరిగిందని, మత్స్యకారుల జీవన ప్రమాణాల పెంపు, అభివృద్ధిలో నాతోడ్పాటు ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం చెరువు వద్ద గల కోటగుట్ట పెద్దమ్మతల్లి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరన రావుల శేషగిరి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ ఛైర్మన్ మన్నె రాజు, డైరెక్టర్లు కె.రాము, సత్యవతి, లక్ష్మణ్, జిల్లా మత్స్యశాఖ అధికారి కీర్తి, గాజులరామారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు యాదగిరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దుర్గయ్య, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయరాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, స్థానికులు పాల్గొన్నారు.

## గురుకులాల పనివేళలు సవరించాలి

### టీఎస్‌యుటీఎఫ్ నేతల విజ్ఞప్తి



సీఎస్ శాంతకుమారికి వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

**ముషీరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:** గురుకులాల పని వేళలను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అనుకూలంగా సవరించాలని టీఎస్‌యుటీఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 2వ తేదీన జీవో నెంబర్ 16 క్రింద గురుకుల పాఠశాలల పనివేళలు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు కానీ ఈ పనివేళలు శాస్త్రీయంగా లేవని, అటు ఉపాధ్యాయులపై, ఇటు విద్యార్థులపై వత్తిడి పెంచి, వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే బోధనా సమయాలను తిరిగి పాత పద్ధతిలోనే అంటే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4.30 వరకు ఉండే విధంగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, గురుకుల విభాగాల నేతలు దూలం ఎల్లయ్య, ఎం. మహేష్, జి.లివిన్ సట్స్, బి.సురేందర్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**

**ముషీరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారని, కలెక్టర్‌పైనే దాడికి దిగారంటే ప్రజలు ఎంత ఆవేశంలో ఉన్నారో అర్ధం చేసుకోవాలని హితవు పలికారు. ప్రజా సంక్షేమం పేరుతో చేపట్టిన సమగ్ర కుల సర్వే కూడా కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలా కొనసాగుతోందని ఆరోపించారు. సర్వేకోసం ఇంటికి వచ్చిన ఎమ్యునరేటర్లను మాకిచ్చిన హామీలేమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తుంటే వారు అటు బాధ్యతలు వీడలేక, ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారని అన్నారు. ప్రభుత్వ వంచనకు గురైన ప్రజలు అధికారులపైకి ప్రత్యక్ష దాడులకు దిగటం ఇదే ప్రథమం అని, ఈ తిరుగుబాటు పునరావృతం కాకముందే ప్రభుత్వం మేలుకొని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఆలయంలో ప్రదక్షిణలు చేస్తూ గుండెపోటుతో యువకుడు మృతి..

**హైదరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త**

ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం విష్ణువర్ధన్ (31) గత సంవత్సర కాలంగా కెపిహెచ్‌బి కాలనీలోని పీజీ హాస్టల్లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం టెంపుల్ బస్‌స్టాప్ సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్ళాడు. ప్రదక్షిణలు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన తోటి భక్తులు సిపిఆర్ చేసి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినా, అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బస్తీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి : ఎమ్మెల్యే తలసాని



ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న సభ్యులు

**సంజీవరెడ్డి నగర్, నవంబర్ 12, ప్రభాతవార్త**

అమీర్‌పేట్ డివిజన్‌లో గల ముస్లిం బస్తీల్లోని అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామి ఇచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ముస్లిం బస్తీ కమిటీ సభ్యులు మంగళవారం వెస్ట్‌మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బస్తీలో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నడూలేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేసిన విషయానిన గుర్తు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘకాలిక సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం చూపామని వివరించారు. బస్తీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు నసీరుద్దీన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అంజద్, ప్రధాన కార్యదర్శి నిసారుద్దీన్, సలహాదారు సయ్యద్ అథిక్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా నాట్యకులపతి రామకోటయ్యకు నృత్యనీరాజనం



జ్యోతిప్రకాసనంచేసి నృత్యనీరాజనం ప్రారంభిస్తున్న డా. భాగవతుల సేతురాం, రోహిణి నాట్యకళాకారులు

**నాంపల్లి, నవంబరు 12 ప్రభాతవార్త :**

తెలంగాణలో తొలి కూచిపూడి నాట్యకులపతి భాగవతుల రామకోటయ్య శతజయంతిని పురస్కరించుకొని లాస్యంగా కూచిపూడి స్కూల్ విద్యార్థులు గురువుకు నేత్రపర్వంగా నృత్యనీరాజనం కావించి అబ్బురపరిచారు. సంస్థ ఎనిమిదవ వార్షికోత్సవం వేడుకల సందర్భంగా సంస్థ డైరెక్టర్ ప్రముఖ నాట్యగురువు రోహిణి కందాల వైభవోపేతంగా జరిగిన ఈ వేడుకలను భాగవతుల రామకోటయ్యకు అంకితం చేశారు. వైవిధ్యభరిత నృత్యాంశాలను చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. ముఖ్యంగా రాజశ్రీ శబ్దం, తాండవ నృత్యకారి వంటి సంప్రదాయ అంశాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. జయగణేశా గణనాథ భజన; దండం పెట్టెనురా అనే త్యాగరాయ కీర్తన, సాంబశివ యనవే అనే స్వరజతి తదితర అంశాలను చిన్నారులు చూడముచ్చటగా ప్రదర్శించి మెప్పించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత నాట్యగురు ఆచార్య భాగవతుల సేతురామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి సంస్థ డైరెక్టర్ రోహిణి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి నృత్యనీరాజనం కావించిన చిన్నారి, యువ నర్తకీమణులను ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేశారు. తండ్రి, గురువు భాగవతుల రామకోటయ్యకు సంస్థ వార్షికోత్సవ వేడుకలను నృత్యనీరాజనంతో అంకితం చేయడం ముదావహం, ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమన్నారు. రోహిణి కందాల తమ నృత్యస్కూల్స్ ద్వారా ఎంతోమంది శిష్యులను గొప్పకళాకారులు తీర్చిదిద్దుతున్న ఆమె ఉత్తమ గురువని, తన శిష్యురాలు కావడం గర్వంగా ఉందని సేతురామ్ అన్నారు. చివరిగా రోహిణి భాగవతుల సేతురామ్‌కు జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించి గురువందనం సమర్పించి ఆశీస్సులు అందుకున్నారు.

## యుద్ధప్రాతిపదికన కల్వర్ట్ పనులు పూర్తి చేయాలి : కార్పొరేటర్



లింగంపల్లి అండర్ రైల్వేబ్రిడ్జి వద్ద బాక్స్ కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఇంజనీరింగ్ అధికారులు

**శేరిలింగంపల్లి, నవంబర్ 12 ప్రభాతవార్త**

లింగంపల్లి రైల్వేఅండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్య శాశ్వతపరిష్కారం దిశగా యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అధికారులను కోరారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి రైల్వేఅండర్ బ్రిడ్జివద్ద బాక్స్ కల్వర్టు వరద నీటి కాలువ నిర్మాణ పనులలో భాగంగా జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఈఈ దుర్గాప్రసాద్,డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్‌లతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. లింగంపల్లి అండర్ బ్రిడ్జి వరద నీటితో నిండిపోవడంతో పరిసర ప్రాంత వాహనదారులకు, ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అండర్ బ్రిడ్జి నుంచి వరద నీటి కాలువ, బాక్స్ కల్వర్టు,నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువచ్చి ముంపు సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొయ్యాడ లక్ష్మణ్‌యాదవ్, గోపాల్‌యాదవ్, సురేశ్‌రాథోడ్, శ్రీనివాస్,వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ ప్రోద్బలంతోనే వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, అధికారులపై దాడి



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగేందర్‌గౌడ్

**సైఫాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రోద్బలంతోనే బిఆర్‌ఎస్ నాయకులు దాడి చేశారని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బిసి పొలిటికల్ జెఎసి ఛైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం నాడు అధికారులపై జరిగిన పాశావిక దాడికి ముందస్తు పథకం ప్రకారమే చేసిన దాడిగా చూడాలని, రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడంగానే పరిగణించి దోషులతోపాటు వారి వెనుక ఉన్న పార్టీ పెద్దలను కూడా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు బిఆర్‌ఎస్ నాయకులు అష్టకష్టాలు పడుతున్నారని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించడంతో హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ లభించడం లేదని, దీంతో కెటిఆర్ పిచ్చిపట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని, కొడంగల్ రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కావడంతో ఉద్యోగులను అడ్డుపెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా అనిశ్చిత సృష్టించి బిఆర్‌ఎస్ నాయకులు లబ్ధి పొందాలని కుట్ర చేయడం సిగ్గు చేటని ఆయన విమర్శించారు. దాడికి పాల్పడిన సురేష్ ఫోన్ నుంచి పట్నం నరేందర్‌రెడ్డికి, కెటిఆర్‌కు ఆనేక సార్లు ఫోన్ కాల్స్ వెళ్ళడం ఆనేక అనుమానాలకు దారితీస్తున్నదని యుగేందర్‌గౌడ్ చెప్పారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు వివి గౌడ్, సాయిబాబా, రాఘవేంద్ర, నగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### వంట కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి

**సైఫాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికుల సమస్యలను పరిష్కారించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం యూనియన్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఉన్నత పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఇ.వి. నర్సింహ్మారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కమలారెడ్డి, అధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి మాసం నుంచి పెండింగ్‌లో ఉన్న 9, 10 విద్యార్థులకు ఇచ్చిన కోడిగుడ్ల బిల్లులను సత్వరమే విడుదల చేయాలని, వంట కార్మికులకు పది వేల రూపాయల వేతనం చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన కమిషనర్ పెండింగ్ బిల్లుల చెల్లింపులపై అధికారులకు సిఫార్సు చేయడం జరిగిందని, త్వరలోనే బిల్లులు విడుదల అవుతాయని చెప్పారు. కార్మికుల వేతనాల పెంపు విషయం ప్రభుత్వ పరిధిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘ నేత సదానందగౌడ్ తదితరులు ఉన్నారు.


**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT: SECUNDERABAD.**
**O. S. No. 236 OF 2024**

BETWEEN:
**M. Rama Krishna ...Plaintiff**
AND
**M. Sarada and Others ...Defendants**

TO,
**All Concerned ...Defendant No.3**
Sir's,
Please take notice that the above plaintiff have filed Suit for declaration to declare the plaintiff and defendant no.1 as surviving legal heirs of deceased **Late Sri M. S. Murthy @ M. Suryanarayana Murthy, Late M. Rupavathi, Late M. Nirmala, Late M. Indira and Late Sri M. Srinivas.** When the matter came up for the consideration the Hon'ble Court was pleased to direct the Plaintiff to issue service of notice through Paper Publication to you and posted the matter for appearance on **13.11.2024 at 10.30 A.M.** before the above Court either in person or through your Counsel. If none of the parties appear on the above date on the above court the matter will be heard as per law.

(By order of the Court)
**NITESH KYLASA**
**Advocates**
#10, Surya Avenue, Trimulgheery, Secbad. **Email: coldasfire@gmail.com. Mob & amp; WA :: 9885382222. TS/2207/2006. HC CODE: 17295.**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B. NAGAR**
**I.A. No. 591 OF 2022 IN O. S. No. 1604 OF 2013**

BETWEEN:
**Mrs. Noorjahan Begum ...Petitioner/Plaintiff**
AND
**Mr. Abdulla Shareef & others ...Respondents/Defendants**

To,
**Respondent No.16/Defendant No.16 M/s. Nymisha Infra Structure Pvt. Ltd.,** O/o, at 5-2/3, Mytrinagar, Madinaguda, Ranga Reddy District, Rep, by its Director, Mr. G.V. Narsimha Rao, S/o. G. Rathaiah, aged about 50 Years, Occ: Business.

Please take notice that whereas the above named petitioner/plaintiff herein has filed above Petition/Suit vide I.A. No. 591 of 2022 in O.S. No. 1604 of 2013 against you for seeking to permit the petitioner to represent on behalf of the plaintiff in O.S. No. 1604 of 2013 and the above petition is posted to **25.11.2024** for your appearance before the above mentioned court at **10.30 A.M.** either through your counsel or in person, if you failed to appear before the above court on the said date, the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE COURT)
**Sd/- MUNEER BASSHA SHAIKH**
**SYED QUTUBUDDIN HUSSAINI**
**T. ASHOK KUMAR**
**G. VIDYASAGAR**
**ADVOCATES**
O/o. 17-9-158, Firasath Residency, Kurmaguda, Sayeedabad, Hyderabad.
**Cell: 7013220596, 8142606367, 9701487506**
**COUNSELS FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B. NAGAR**
**I.A. No. 224 OF 2020 IN O. S. No. 1604 OF 2013**

BETWEEN:
**Mrs. Noorjahan Begum ...Petitioner/Plaintiff**
AND
**Mr. Abdulla Shareef & others ...Respondents/Defendants**

To,
**Respondent No.16/Defendant No.16 M/s. Nymisha Infra Structure Pvt. Ltd.,** O/o, at 5-2/3, Mytrinagar, Madinaguda, Ranga Reddy District, Rep, by its Director, Mr. G.V. Narsimha Rao, S/o. G. Rathaiah, aged about 50 Years, Occ: Business.

Please take notice that whereas the above named petitioner/plaintiff herein has filed above Petition/Suit vide I.A. No. 224 of 2020 in O.S. No. 1604 of 2013 against you for seeking to set aside the order Dt. 17.04.2019 in O.S. No. 1604 of 2013 by restoring the suit to its original position and the above petition is poste to **25.11.2024** for your appearance before the above mentioned court at **10.30 A.M.** either through your counsel or in person, if you failed to appear before the above court on the said date, the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE COURT)
**Sd/- MUNEER BASSHA SHAIKH**
**SYED QUTUBUDDIN HUSSAINI**
**T. ASHOK KUMAR**
**G. VIDYASAGAR**
**ADVOCATES**
O/o. 17-9-158, Firasath Residency, Kurmaguda, Sayeedabad, Hyderabad.
**Cell: 7013220596, 8142606367, 9701487506**
**COUNSELS FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B. NAGAR**
**I.A. No. 223 OF 2020 IN O. S. No. 1604 OF 2013**

BETWEEN:
**Mrs. Noorjahan Begum ...Petitioner/Plaintiff**
AND
**Mr. Abdulla Shareef & others ...Respondents/Defendants**

To,
**Respondent No.16/Defendant No.16 M/s. Nymisha Infra Structure Pvt. Ltd.,** O/o, at 5-2/3, Mytrinagar, Madinaguda, Ranga Reddy District, Rep, by its Director, Mr. G.V. Narsimha Rao, S/o. G. Rathaiah, aged about 50 Years, Occ: Business.

Please take notice that whereas the above named petitioner/plaintiff herein has filed above Petition/Suit vide I.A. No. 223 of 2020 in O.S. No. 1604 of 2013 against you for seeking condone the delay of 571 days in filing the restoration and the above petition is posted to **25.11.2024** for your appearance before the above mentioned court at **10.30 A.M.** either through your counsel or in person, if you failed to appear before the above court on the said date, the matter will be decided in your absence as per law.

(BY ORDER OF THE COURT)
**Sd/- MUNEER BASSHA SHAIKH**
**SYED QUTUBUDDIN HUSSAINI**
**T. ASHOK KUMAR**
**G. VIDYASAGAR**
**ADVOCATES**
O/o. 17-9-158, Firasath Residency, Kurmaguda, Sayeedabad, Hyderabad.
**Cell: 7013220596, 8142606367, 9701487506**
**COUNSELS FOR THE PLAINTIFF**

**IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**I.A.No. 133 OF 2024 IN O.S.No. 2784 OF 2019**

Between:
**Maram Nagaiah ...Plaintiff**
AND
**J. Satyanarayana & another ...Defendants**

To
**D. Srinivasa Rao,** S/o. D. Linga Rao, Aged about 65 years, Occ: Business, R/o. Flat No.3/15, HIG, Bagh Lingampally, Hyderabad.
**...Respondent No.2/ Defendant No.2**

Please take notice that the above matter is posted to **21-11-2024** for your appearance either in person or through an advocate before the above Court on the above date by **10.30 AM,** failing which you will be set ex parte and the Court will decide the matter in your absence.

(BY ORDER OF THE COURT)
**Sd/- D. JAGADISHWAR RAO**
**K. VEMA REDDY**
**P. RAJENDER REDDY**
**D. MANJULA**
**K. SUMAN BABU**
**Advocates**
# Flat No.302, 3rd Floor, Owners Pride, Opp: Pizza Hut, Road No.12, Banjara Hills, Hyderabad - 500034

